క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



మణికొండ గార్డెన్ కాలనీలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్లు

మణికొండ: మణికొండ గార్డెన్ కాలనీలో కొన సాగుతున్న డ్రైనేజీ పనులను కౌన్సిలర్లు కె. రామకృష్ణారెడ్డి, వసంతరావులు పరిశీలించారు. గత కొంత కాలంగా సెక్రటేరియట్ కాలనీ ఆవరణలో డ్రైనేజీ విస్తరణ పనులు కొన సాగుతుండగా.. ఇప్పటి వరకు మూసి ఉంచిన మురుగునీటి కాలువను బుధవారం జాయింట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డ్రైనేజీ సామర్థ్యం పెంపు పనులతో పలు కాలనీలకు వరద ముంపు, డ్రైనేజీ సమస్య తొలగిపోతుందన్నారు. మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీరాములు, నాయకులు శ్రావణ్‌కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి



బియ్యం బస్తాలను అందజేస్తున్న కౌన్సిలర్ యాదమ్మ

మణికొండ: పేదలకు సాయం చేస్తే అది మనసుకు ఎంతో మానసిక సంతృప్తిని ఇస్తుందని నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లి కౌన్సిలర్లు యాదమ్మ అన్నారు. బుధవారం ఆమె కుమారుడి పుట్టినరోజు సందర్భంగా మున్సిపల్ కార్మికులకు 25 కేజీల చొప్పున బియ్యం బస్తాలు, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన నోటుబుక్స్, స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. మనకు ఉన్న దాంట్లో కొంత లేనివారికి ఇవ్వడం సహజమన్నారు. నాయకులు ప్రదీప్‌కుమార్, బాలరాజ్, శ్రీనివాస్, పాపాలాల్ తదితరులున్నారు.

పేద విద్యార్థులకు చేయూత



విద్యార్థులకు షూస్‌ను పంపిణీ చేస్తున్న వీఫర్‌యూ సంస్థ ప్రతినిధులు

మణికొండ: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు మనవంతుగా చేయూతనందించాల్సిన అవసరం ఉందని వీఫర్‌యూ స్వచ్ఛంద సంస్థ సభ్యుడు, ఈఎన్‌టీ డాక్టర్ జీవీఎస్‌రావు అన్నారు. బుధవారం ఆయన మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 400 మంది విద్యార్థులకు షూస్, జామెంట్రీ బాక్సులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు మనకు ఎంతో మానసిక తృప్తినిస్తాయన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి సీతారాందాస్, కోశాధికారి దిలీప్ కక్కడ్, సభ్యులు శివరామకృష్ణ, నాగేంద్రరావు, డాక్టర్ ప్రభావతి, ఎ.లక్ష్మణ్‌రావు, ప్రధానోపాధ్యాయుడు నిరంజన్, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మపల్లి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



పల్లకిసేవలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా మండలంలోని అమ్మపల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పల్లకి సేవలో పాల్గొన్న ఆయనకు అర్చకులు ఆశీర్వచనం ఇచ్చారు. దూపదీప నైవేద్యం పథకంలో ఎంపికై న మదన్‌పల్లి ఆలయ అర్చకులకు ఉత్తర్వు పత్రాలను అందజేశారు. ఎంపీపీ జయమ్మ, నీరటి జడ్పీటీసీ తన్వీరాజు, సొసైటీ చైర్మన్ సతీష్, సర్పంచ్ సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

మణికొండ: రోజూ మాదిరిగానే పనికోసం ఇంటి నుంచి బయటికి వెళ్లిన వ్యక్తి తిరిగి రాకపోవటంతో అతడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నార్సింగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివకృష్ణ (27) కోకాపేటలో నివసిస్తూ.. నార్సింగిలో నారాయణ బట్టల షాపులో టైలర్‌గా పనిచేస్తున్నాడు. కాగా సోమవారం పనికని ఇంటి నుంచి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. తెలిసిన చోట్ల వెతికినా ప్రయోజనం లేకపోవటంతో తల్లి లక్ష్మమ్మ నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో..



ఖానాపూర్ విద్యావికాస్ స్కూల్‌లో..



శారదాధామంలో యోగా దివస్‌లో పాల్గొన్న విద్యార్థులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

రాజేంద్రనగర్ జోన్ పరిధిలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థల్లో నిర్వహించిన యోగా దినోత్సవంలో పలువురు ప్రజాప్రతినిధులు యోగా చేసి ప్రాముఖ్యతను వివరించారు. యోగాతో శారీరక సమస్యలు తొలగిపోతాయన్నారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగా చేయాలని సూచించారు.

– రాజేంద్రనగర్ జోన్ బృందం



యోగా దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



లక్ష్మీనగర్ పార్కులో..



వర్సిటీలో యోగా చేస్తున్న విద్యార్థులు, అధికారులు, నాయకులు



యోగా గురువులను సన్మానిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి



మణికొండ సెక్రటేరియట్ కాలనీలో మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్



శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో యోగాదినోత్సవం



మైహోం అవతార్‌లో..



మహవీర్ ఇంజనీరింగ్ కళాశాలలో..



వాసవి క్లబ్ కపుల్స్ 2కే రన్‌ను ప్రారంభిస్తున్న మణికొండ మున్సిపల్ చైర్మన్



పోలీస్ అకాడమీలో యోగా దినోత్సవంలో పాల్గొన్న అధికారులు



కోకాపేట కమ్యూనిటీహాల్‌లో..

ఆరెమైసమ్మ ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బండ్లగూడ చౌరస్తాలోని ఆరెమైసమ్మ దేవాలయాన్ని తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, కార్పొరేషన్ కార్పొరేటర్ సాగర్‌గౌడ్ తదితరులున్నారు.



మంత్రి సబితాఇంద్రారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

ప్రైవేటు స్కూల్ సంఘాల ప్రతినిధుల సమావేశం



సమావేశంలో పాల్గొన్న సంఘాల సభ్యులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ఎంఈఓ కార్యాలయంలో ప్రైవేటుస్కూల్ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్‌ల సమావేశం నిర్వహించారు. ఎంఈఓ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ (టీఎస్ఎస్ఓ) రాష్ట్ర అధ్యక్షులు మీసాల లక్ష్మీనివాస్ హాజరయ్యారు. ప్రైవేటుస్కూల్ యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయకూడదని అదేవిధంగా విద్యావ్యవస్థను వ్యాపారంగా మార్చవద్దన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చట్టానికి లోబడి ప్రతిఒక్కరూ పని చేయాలన్నారు. టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్‌గౌడ్, రాజేంద్రనగర్ మండల టీఎస్ఎస్ఓ కళాశాల అధ్యక్షులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆధ్యాత్మిక వేడుకలు

శేరిలింగంపల్లి: దశాబ్ది వేడుకల్లో భాగంగా ఆధ్యాత్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం శేరిలింగంపల్లి తారానగర్‌లోని శ్రీ తుల్జాభవాని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలో ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మల్లికార్జునశర్మ, బీఆర్ఎస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, కృష్ణయాదవ్, గోవిందచారి, గోపీకృష్ణ, కవిత, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



స్కూల్ బ్యాగ్‌ల పంపిణీ



గచ్చిబౌలి: ప్రతిభ చాటిన విద్యార్థులకు ఉద్యోగం వచ్చే వరకు రఘునాథ్ ఫౌండేషన్ చేయూత ఇస్తుందని బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి, రఘునాథ్‌యాదవ్ ఫౌండేషన్ చైర్మన్ రఘునాథ్‌యాదవ్ స్పష్టం చేశారు. కొండాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పదోతరగతిలో ప్రతిభ చాటే 5మంది విద్యార్థుల ఉన్నత విద్యకు సహకారం అందిస్తామన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు అనంతరెడ్డిని ఆయన అభినందించారు.

విద్యార్థినికి సన్మానం.. అభినందన

రాజేంద్రనగర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యాక్రమంలో ఇంటర్మీడియట్ స్థాయిలో వివిధ గ్రూపుల్లో స్టేట్ టాపర్స్‌గా నిలిచిన రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులను ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల రాజేంద్రనగర్ విద్యార్థిని మంజుల చవాన్ సీఈసీ విభాగంలో 973 మార్కులు సాధించి స్టేట్ టాపర్‌గా నిలిచినందుకు విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి సన్మానించి రూ.10 వేల నగదు బహుమతిని అందజేశారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, హోంశాఖ మంత్రి మహమూద్ అలీలు హాజరై విద్యార్థులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎర్ర అంజయ్య, అధ్యాపకులు స్వప్న, కిరణ్‌కుమార్, పరశురాం, చంద్రశేఖర్, కృష్ణారెడ్డి, మురళి, పార్థసారధి, శశిధర్, భరత్, నర్సింగ్ తదితరులున్నారు.



విద్యార్థిని మంజుల చవాన్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి

సర్వమత ప్రార్థనలు



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

శంషాబాద్: స్వరాష్ట్రంలో ఆధ్యాత్మిక వైభవం పెరిగిందని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. దశాబ్ది అవతరణ ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మిషన్‌కంపౌండ్‌లోని చర్చితో పాటు పట్టణంలోని మజీదులో ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. అన్ని మతాలకు సముచిత ప్రాధాన్యతను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. నార్సింగి ఏఎంసీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్‌యాదవ్, సీనియర్ నాయకులు ఆర్. గణేష్ గుప్తా, కౌన్సిలర్లు మేకల వెంకటేష్‌ముదిరాజ్, కుమార్ తదితరులున్నారు.

మనూ కొత్త కార్యవర్గం

రాయదుర్గం: ఉర్దూ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (మనూటా)కు కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ సమక్షంలో వారు బాధ్యతలు చేపట్టారు. కమిటీ అధ్యక్షురాలుగా డాక్టర్ షబానాకేసర్, ఉపాధ్యక్షుడుగా డాక్టర్ సలావుద్దీన్ సయ్యద్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ జమీల్ అహ్మద్, సంయుక్త కార్యదర్శి(ఆర్గనైజింగ్) గా డాక్టర్ మజీద్ అలీ చౌదరి, సంయుక్త కార్యదర్శి (పబ్లిసిటీ)గా అహ్మద్ తల్హాసిద్దిఖీ, కోశాధికారిగా చావ్లా ముత్యాలరావు బాధ్యతలు చేపట్టారు. వీసీ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ టీచింగ్ కమ్యూనిటీ, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు.

యువతి అదృశ్యం



గౌతమి (ఫైల్)

శంషాబాద్ రూరల్: ఇంటి నుంచి కిరాణ దుకాణానికి వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నగోల్కొండకు చెందిన గౌతమి(22) ఇంటర్మీడియట్ చదువుకుని ప్రస్తుతం ఇంటివద్దే ఉంటోంది. ఈ క్రమంలో ఈనెల 19 న ఇంటి నుంచి కిరాణ దుకాణానికి వెళ్లి తిరిగి రాలేదు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబసభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ప్రభుత్వ పాఠశాలలపై విద్యాశాఖ నిర్లక్ష్యవైఖరి'

శంషాబాద్: ప్రభుత్వ పాఠశాలలను విద్యాశాఖ పూర్తి నిర్లక్ష్యవైఖరి ప్రదర్శిస్తోందని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో స్కావేంజర్‌లను తొలగించడంతో పరిశుభ్రత కోల్పోయి అస్తవ్యస్తంగా మారుతున్నాయన్నారు. బుధవారం ఆయన తొండుపల్లి తదితర ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలల పరిశుభ్రతను స్థానిక సంస్థలకు అప్పగించినా.. వారు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో పాఠశాలల పరిశుభ్రత బాధ్యత ఉపాధ్యాయులు, విద్యార్థులకే భారంగా మారుతుందన్నారు. కేజీటూ పీజీ విద్య మిథ్యగా మారిందని వాపోయారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల భర్తీలో కూడా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల మెరుగుకోసం చర్యలు తీసుకోకుంటే విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.



పాఠశాలను పరిశీలిస్తున్న బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్ తదితరులు

పోలీస్ అకాడమీలో ప్రాక్టీస్ క్రికెట్‌పిచ్‌ల ప్రారంభం



క్రికెట్‌పిచ్‌లను ప్రారంభిస్తున్న దృశ్యం

బండ్లగూడ: రాజా బహదూర్ వెంకటరామరెడ్డి తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో ప్రాక్టీస్ క్రికెట్ పిచ్‌లను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ప్రింటింగ్, స్టేషనరీ, స్పెషల్ ప్రొటెక్షన్ డీసీపీ ఉమేష్‌శరాఫ్ హాజరయ్యారు. నాలుగు క్రికెట్ పిచ్‌లను ప్రాక్టీస్ కోసం ఏర్పాటు చేయించినట్టు సమాచారం. అకాడమీ డైరెక్టర్ సందీప్ శాండిల్య, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నవీన్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ జానకీషర్మిల, అనసూయ, రాదేష్‌మురళీ, శ్రీరామమూర్తి, రాఘవరావు, అసిస్టెంట్ డైరెక్టర్లు గంగారెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకట్రావు, భూపాల్, శ్రీదేవి, శ్రీనివాసరావు, డీఎస్పీలు శ్రీనివాసరావు, అమృతారెడ్డి, నరహరి, కృష్ణ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అసైన్డ్ భూములను అక్రమంగా స్వాధీనం చేసుకుంటున్నారని ఫిర్యాదు

శంషాబాద్: మండలంలోని మదన్‌పల్లి కొత్త తండాలోని అసైన్డ్ భూములను ప్రజాప్రతినిధులతో పాటు కొందరు బీఆర్ఎస్ వ్యక్తులు బలవంతంగా స్వాధీనం చేసుకుంటున్నాని స్థానికులు తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి బుధవారం ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 50లో 500 ఎకరాల అసైన్డు భూముల్లో అక్రమార్కులు రెచ్చిపోతున్నారని ఆరోపించారు. ఎంపీటీసీ భర్తతోపాటు కొందరు బీఆర్ఎస్ నేతలు పేదల నుంచి బలవంతంగా అసైన్డు భూములను లాక్కుంటున్నారని ఫిర్యాదు చేశారు. అసైన్డు భూముల్లో జరుగుతున్న అక్రమాలపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి

శంషాబాద్: ప్రపంచంలోనే మానవ అక్రమ రవాణా అతిపెద్ద నేరంగా ఉందని ఏపీఎం అహల్య అన్నారు. ప్రజ్వల సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మహిళా సమాఖ్య కార్యాలయంలో ఐకేపీ, డీఆర్‌డీఏ, వీఓఏలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మానవ అక్రమ రవాణాపై అప్రమత్తత అవసరమన్నారు. ఆర్థిక, సామాజిక అసమానతలను ఆధారం చేసుకున్న వ్యవస్థీకృతంగా ఇలాంటి నేరాలు జరుగుతున్నాయన్నారు. మనచుట్టూ ఉన్న సమాజంపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండడంతో పాటు బాధితులుగా మారే అవకాశాలున్న వారిని కూడా అప్రమత్తం చేసి చైతన్యపరచాలన్నారు. ప్రజ్వల సంస్థ సీనియర్ కో–ఆర్డినేటర్ సురేష్‌కుమార్, వినోద్‌కుమార్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

